సాక్షి
నారాయణపేట
బుధవారం । 29 । మార్చి । 2023



బ్రహ్మోత్సవ కళ
సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



'డబుల్' ఇళ్లకు మోక్షం
జడ్చర్లలో 'డబుల్' ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు చేపట్టారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
38.3 /23.4

వాతావరణం
ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం తీవ్రత పెరుగుతుంది. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.



న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు

నారాయణపేట రూరల్: ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు మంగళవారం వార్షిక పరీక్షలు పూర్తయ్యాయి. చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4,049మంది హాజరయ్యారు. 189మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 476మంది పరీక్ష రాశారు. 24మంది గైర్హాజరయ్యారు.

పుట్టెడు దుఃఖంతో పరీక్షకు..
పట్టణంలోని సుభాష్‌రోడ్డుకు చెందిన సుజల్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. అయితే సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని తల్లి నాగేశ్వరి మృతి చెందింది. విషయం తెలిసి కుమిలిపోతూనే మంగళవారం జరిగిన కెమిస్ట్రీ పరీక్షకు హాజరయ్యాడు. అనంతరం తల్లి అంత్యక్రియలకు వెళ్లాడు.

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి: డీఈఓ

కోస్గి: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడంతోపాటు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి లియాకత్ అలీ సూచించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో పదో తరగతి పరీక్షల కోసం ఎంపిక చేసిన జెడ్పీబాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉర్దూ మీడియం పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, పరీక్ష గదుల్లో వెలుతురు కోసం అవసరమైతే విద్యుత్ ఏర్పాటు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ఆయా కేంద్రాల ఇన్‌చార్జీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ అధికారి యాదయ్య శెట్టి, జిల్లా పరీక్షల నిర్వహణ కార్యదర్శి వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట రూరల్: జిల్లా ప్రజలకు ఆర్టీసీ అందిస్తున్న రవాణా సేవలకు సంబంధించి, సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం ప్రయాణికులు బుధవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు సెల్ నంబర్ 73828 26293కి కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

కంటికి పరీక్షే..!


- ఊసేలేని శస్త్ర చికిత్సలు
- 'కంటి వెలుగు'లో పరీక్షలు మాత్రమే చేసి వదిలేస్తున్న వైనం
- మొక్కుబడిగా రెండో విడత కార్యక్రమం



మరికల్‌లో మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

మరికల్: జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. శిబిరాల్లో వైద్య బృందం కంటి పరీక్షలు మాత్రమే చేసి వదిలేస్తున్నారు. ఈకార్యక్రమం ప్రారంభించిన తర్వాత నేటి వరకు కూడా శస్త్ర చికిత్సలు చేయడంలేదు. దీంతో దృష్టి లోపం ఉన్నవారు నిరుత్సాహానికి గురవుతున్నారు. అవసరం ఉన్న అందరికీ కళ్లద్దాలు కూడా అందించడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పరీక్షలు చేయడానికే శిబిరాలు ఎందుకంటూ పలువురు పెదవి విరుస్తున్నారు.

ఆపరేషన్‌కు హైదరాబాద్‌కి రెఫర్!
జిల్లాలో జనవరి 18 నుంచి రెండో విడత కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించారు. మొత్తం 24 శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజులు శని, ఆదివారం మినహా అన్ని పని దినాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగిస్తున్నారు. శిబిరాల్లో దగ్గరిచూపు సమస్య ఉన్నవారికి వెంటనే అద్దాలు పంపిణీ చేస్తున్నారు. దూరపుచూపు బాధితుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒక్కో శిబిరంలో రోజుకు 120 నుంచి 150 మందికి పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,21,658 మందికి కంటి పరీక్షలు చేశారు. దూరపుచూపులో లోపం ఉన్నవారికి అందించేందుకు కళ్లద్దాల కోసం ఆన్‌లైన్‌లో సిఫార్సు చేశారు. కాగా పరీక్షల అనంతరం దృష్టిలోపం ఉన్న ఒక్కరికి కూడా శస్త్రచికిత్స చేయలేదు. కళ్లకు పొర వచ్చి దృష్టిలోపం ఉన్నవారికి కంటివెలుగు కార్డు ఇచ్చి హైదరాబాద్‌లోని సరోజినీ కంటి ఆస్పత్రికి వెళ్లాలని సూచించి, చేతులు దులుపుకుంటున్నారు.



జిల్లాలో కంటి వెలుగు వివరాలు..	నేత్ర పరీక్షలు చేయించుకున్న వారు	రీడింగ్ అద్దాల పంపిణీ	దూరపుచూపు కళ్లద్దాలకు సిఫార్సు
	1,21,658	16,123	9,723

సొంత డబ్బుతో ఆపరేషన్ చేయించుకున్నా..



కంటి వెలుగు శిబిరంలో రెండు కళ్లను చూపించుకున్నాను. ఒక కంటికి ఆపరేషన్ చేసుకోవాలని డాక్టర్లు చెప్పారు. కంటివెలుగు పూర్తయిన తర్వాతనే ఆపరేషన్లు చేస్తామని చెప్పడంతో సొంత డబ్బుతో హైదరాబాద్‌లోని కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నాను. దృష్టి లోపం ఉందని అద్దాలు ఇస్తామన్నారు. కానీ ఇంతవరకు అద్దాలు కూడా ఇవ్వలేదు.

– మల్లప్ప, మరికల్

కళ్లద్దాలు ఇవ్వలేదు..



కంటి పరీక్షలు చేయించుకున్న తర్వాత దూరంచూపు సక్రమంగా కనిపించడం లేదన్నారు. ప్రస్తుతానికి మందులు ఇచ్చి 15రోజుల అనంతరం అద్దాలు ఇస్తామన్నారు. ఇంతవరకు అద్దాలు ఇవ్వలేదు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రిల్లో మళ్లీ కంటి పరీక్షలను చేయించుకొని అద్దాలు తెచ్చుకున్నాను. – మల్లేష్, మరికల్

కంటి ఆపరేషన్ అప్పుడే..

జిల్లావ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత జిల్లా కేంద్రంలోనే క్యాంపులు ఏర్పాటు చేసి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తాం. అంతవరకు కంటిపరీక్షలే చేస్తారు. ఇందులో అవసరం ఉన్నవారికి అద్దాలు పంపిణీ చేస్తున్నాం. ప్రస్తుతం ఎవరికి శస్త్ర చికిత్సలు చేయడం లేదు.

– రామమనోహర్ రావు, డీఎంహెచ్ఓ

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఈఓ లియాకత్ అలీ



నారాయణపేట రూరల్: వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల ఎంపిక, అవసరమైన సౌకర్యాలు, పరీక్ష పత్రాలు చేర్చడం తదితర అంశాలపై డీఈఓ లియాకత్‌అలీ 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

■ **ప్రశ్న:** జిల్లాలో ఎన్ని ఉన్నత పాఠశాలలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు?

● **జవాబు:** జిల్లా వ్యాప్తంగా 6 ప్రభుత్వ, 70 లోకల్ బాడీ, మూడు ఎయిడెడ్, 35 ప్రైవేటు, 11 కేజీబీవీ, మూడు జ్యోతిరావు పూలే, రెండు మాడల్ స్కూళ్లు, రెండు మైనార్టీ, ఆరు సోషల్ వెల్ఫేర్, ఒక ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 7,564 రెగ్యులర్ విద్యార్థులలో 3,583 బాలురు, 3,981 బాలికలు, 47మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు.

■ **ప్రశ్న:** పరీక్షల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

● **జవాబు:** పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతీ సెంటర్‌లో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. అదేవిధంగా ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా, మరో ఏడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశాము. వీరు పరీక్ష ప్రారంభం నుంచి చివరివరకు కేంద్రంలోనే ఉండి పర్యవేక్షిస్తారు. పరీక్షల సమయంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రతీ కేంద్రానికి తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయిస్తున్నాం.

■ **ప్రశ్న:** పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారా?

● **జవాబు:** పరీక్షల నిర్వహణ కోసం ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను సెంటర్ల వారీగా నియమించి సమావేశాలు నిర్వహించాం. ప్రత్యేక్ష శిక్షణతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. నిబంధనలకు సంబంధించిన బుక్‌లెట్ పంపిణీ చేశాం. ఇన్విజిలేటర్ల నియామకం జరుగుతుంది. వారికి తగిన సూచనలు చేస్తున్నాం.

■ **ప్రశ్న:** పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించారు?

● **జవాబు:** కలెక్టర్ చొరవతో అన్ని శాఖలను సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాలుగా గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వెలుతురు, గాలి వచ్చేలా ఏర్పాటు చేశాం. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు ఉండేలా మార్పులు చేశాం. వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తాం. శాంతిభద్రతల విషయంలో పోలీసుల సహకారంతో 144 సెక్షన్ అమలు చేయిస్తాం. సమయానికి విద్యార్థులు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయిస్తున్నాం.

■ **ప్రశ్న:** జిల్లాలో ఎన్ని పరీక్ష కేంద్రాలు ఉన్నాయి? ఎంతమంది సిబ్బందిని వినియోగిస్తున్నారు?

● **జవాబు:** జిల్లా వ్యాప్తంగా 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో పట్టణంలోని బాలికల పాఠశాలలో ప్రైవేటు విద్యార్థులను క్లబ్ చేయడం జరిగింది. 38మంది సీఎస్, 40మంది డీఓలు, 440మంది ఇన్విజిలేటర్లతో పాటు స్క్వాడ్ డ్యూటీకి విద్యాశాఖతో పాటు రెవెన్యూ, పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నాం.

■ **ప్రశ్న:** విద్యార్థుల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నంబర్ ఉందా?

● **జవాబు:** విద్యార్థుల సందేహాల నివృత్తికి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, ఫిర్యాదులు, సలహాలు తెలియజేయాలనుకుంటే సెల్ నంబర్ 94402 32039కు సమాచారం ఇవ్వడానికి అందుబాటులో ఉంచాము.

■ **ప్రశ్న:** హాల్‌టికెట్ల విషయంలో ఇబ్బందులు ఎలా అధిగమించాలి?

● **జవాబు:** హాల్‌టికెట్లు పాఠశాలలకు పంపడంతో పాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నేరుగా హాల్‌టికెట్లను విద్యార్థులకు అందిస్తారు. ఇక ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఆపినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు సైతం 'బీఎస్ఈ.తెలంగాణ.జీఓవీ.ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా తమ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హెచ్ఎం సంతకం లేకుండానే పరీక్షకు నేరుగా హాజరుకావచ్చు.

■ **ప్రశ్న:** పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేశారు?

● **జవాబు:** ఈ పరీక్షల నిర్వహణ ప్రతీ టీచర్‌కు సవాల్‌గా మారింది. పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అభ్యాస దీపికలు అందించాము. రెండుసార్లు ప్రి ఫైనల్ పరీక్షలను నిర్వహించి పరీక్షల మాడల్ తెలియజేశాం. వందశాతం ఉత్తీర్ణతతో పాటు ఎక్కువ సంఖ్యలో 10జీపీఏ సాధనకు కృషి చేస్తున్నాం.

■ **ప్రశ్న:** పరీక్ష సమయం ఎలా ఉంటుంది? నిబంధనలు ఏమిటి?

● **జవాబు:** గతంలో 11 పరీక్షలు ఉండేవి. ఈసారి కేవలం ఆరు పరీక్షలు మాత్రమే ఉండనున్నాయి. ప్రతిరోజు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష జరుగుతుంది. సెకండ్ లాంగ్వేజ్, భౌతిక, జీవశాస్త్రం పరీక్షలకు 20నిమిషాలు అదనంగా ఉంటుంది. గంటముందే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తాం. పరీక్షకు ముందే విద్యార్థుల సమాచారం ఇన్విజిలేటర్లు నమోదు చేసుకుంటారు.

స్వయం ఉపాధిని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందేందుకు అర్హులైన దరఖాస్తుదారులకు తోడ్పాటును అందించి రుణాలు అందించాలని చెప్పారు. పీఎం మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు జిల్లా గ్రామీణ శాఖ ద్వారా 275 దరఖాస్తులకు కేవలం 34మాత్రమే గ్రౌండింగ్ కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని చేధించాలన్నారు. నూతన మండలాల్లో బ్యాంకులు ఏర్పాటు చేయాలని, మద్దూర్, కోస్గి, నారాయణపేట, మరికల్‌లో ఏటీఎంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీడీఎం షణ్ముఖచారి, ఎల్‌టీఓ తేజ, లీడ్ బ్యాంక్ మేనేజర్ పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని మున్సిపాలిటీల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను త్వరగా వసూలు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని మక్తల్, నారాయణపేట, కోస్గి మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, డంపింగ్‌యార్డుల్లో సీసీరోడ్డు, వైకుంఠధామం పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఈవీఎం, వీవీప్యాట్‌ల భద్రత పరిశీలన..
జిల్లా కేంద్రంలో భద్రపర్చిన ఈవీఎం, వీవీప్యాట్‌ల రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం గోదామును పరిశీలించారు. ఇటీవల ఈసీఐఎల్ నుంచి జిల్లాకు వచ్చిన 840 మిషన్లను వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి సరిచూశారు. ఆర్డీఓ రాంచందర్, జగదీశ్వర్, దానయ్య, సాయినాథ్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలను ప్రజలకు చేర్చాలి



నర్వ: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ ఫలాలను ప్రజల వద్దకు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని బీఆర్ఎస్ మక్తల్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో పాటు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రతి రాష్ట్రం తెలంగాణ వైపు చూస్తున్నారని, దీనికి కారణం ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి, సంక్షేమ ఫలాలే నిదర్శనమన్నారు. మక్తల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపట్టిన రైతు సంక్షేమ పథకాలతో పాటు అనేక అభివృద్ధి పనులను ప్రతి గ్రామంలో తెలియజేసి, రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా మక్తల్‌లో ఎగరవేయాలని కోరారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఆదరిస్తున్న ప్రజలకు, అందుకు కృషి చేసిన కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరి మల్లప్ప, నర్వ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, నర్వ, మరికల్ ఎంపీపీలు జయరాములుశెట్టి, శశికళ, జెడ్పీటీసీ గౌనిజ్యోతి, విండో చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వీణావతి, రైతుసమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ మండ్ల చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఉత్తమ సేవలు అందించి రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకున్నారు. డీజీపీ నుంచి ప్రశంసలు పొందిన వారిని స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అభినందించారు. హైదరాబాద్‌లోని మోయినాబాద్ వద్ద జరిగిన క్లోస్ ప్రొటెక్షన్ టీమ్ కోర్సుకు వెళ్లిన ఐదుగురు ప్రతిభ చూపి బెస్ట్ ఫైరర్‌గా ఎంపికయ్యారు. వారిలో కానిస్టేబుళ్లు ఇస్మాయిల్, ఆల్‌రౌండర్‌గా ఎంపికైన మహిళా పోలీసు చరిత, ఊట్కూర్, మద్దూర్ పీఎస్‌ల రిసెప్షనిస్టులు చంద్రకళ, కృష్ణవేణి ప్రశంసా పత్రాలు, క్యాష్ అవార్డు అందుకున్నారు. అదేవిధంగా ఫిబ్రవరికి సంబంధించి విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 19మంది కేపీఐ రివార్డులను ఎస్పీ అందించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐలు నరేందర్, శ్రీనివాస్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మక్తల్‌లో వెంచర్ల పరిశీలన



వెంచర్ల లేఅవుట్ పత్రాలు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

మక్తల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వెంచర్లను అడిషనల్ కలెక్టర్ మియాంక్ మిట్టల్ మంగళవారం పరిశీలించారు. మొదటగా కాటన్‌మిల్ వద్ద ఉన్న వెంచర్ లేఅవుట్‌లను ఏర్పాటు చేసుకునేందుకు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా వివాదంలో ఉన్న మరో వెంచర్ ట్రాక్టర్ షో రూం వెనుక ఉన్న వెంచర్లను పరిశీలించారు. రెండు వెంచర్లకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. కొన్ని సక్రమంగా లేకపోవడంతో రికార్డు ప్రకారంగానే అనుమతులు ఇస్తామని అన్నారు. ఆయన వెంట కమిషనర్ మల్లికార్జున్, ఎంపీడీఓ శ్రీధర్, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ఉన్నారు.

లీకేజీలో 'ఉపాధి'..!

- ఈజీఎస్ చుట్టే టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారం
- సిట్ దర్యాప్తులో ఒక్కొక్కరిగా పేర్లు వెలుగులోకి..
- పట్టుబడిన వారిలో ఉమ్మడి పాలమూరువాసులే అధికం
- తొలుత 9 మందిలో ఆరుగురు.. ఆ తర్వాత మరో ముగ్గురు
- డీఆర్డీఓ అధికారుల నుంచి సైతం వివరాల సేకరణ
- కాంట్రాక్ట్ సిబ్బందిలో గుబులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారం పాలమూరు జిల్లాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. సిట్ దర్యాప్తులో పాలమూరువాసుల పేర్లు ఒక్కొక్కరిగా వెలుగులోకి వస్తుండడం కలకలం రేపుతోంది. ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగుల చుట్టే తిరుగుతుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ బాగోతంలో ఇప్పటివరకు పట్టుబడిన నిందితుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వారే అధికంగా ఉండగా.. వీరితో పాటు ఇంకెవరైనా ఉన్నారా? ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి? వంటి తదితర కోణాల్లో విచారణ అధికారులు జల్లెడ పడుతుండడం ఉత్కంఠ రేపుతోంది.

తొలుత ఆరుగురు..
టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అసిస్టెంట్ ఇంజినీర్స్ (ఏఈ సివిల్) పరీక్ష పేపర్లు లీకైనట్లు తొలుత వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చేపట్టిన విచారణలో గ్రూప్–1, తదితర ప్రశ్న పత్రాలు సైతం లీకైనట్లు బహిర్గతమైంది. అయితే తొలుత అదుపులోకి తీసుకున్న నిందితుల్లో తొమ్మిదిమందిలో ఉమ్మడి పాలమూరుకు చెందిన వారే ఆరుగురు ఉండడం హాట్‌టాపిక్‌గా మారింది. పట్టుబడిన ప్రధాన నిందితుల్లో రేణుకా రాథోడ్, లవుడ్యావత్ డాక్యా దంపతులు. రేణుకది గండేడ్ మండలం మన్సూర్‌పల్లి తండా కాగా.. డాక్యాది అదే మండలంలోని పంచాంగల్ తండా. వీరితో పాటు రాజేశ్వర్, శ్రీనివాస్, నీలేశ్‌నాయక్, రాజేంద్రనాయక్ మన్సూర్‌పల్లి తండాకు చెందినవారే.

ఇంకొకరు.. మరో ఇద్దరు..
నవాబుపేట మండలంలో ఉపాధి హామీ పథకంలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ప్రశాంత్‌రెడ్డిని సిట్ బృందం ఈ నెల 24న అదుపులోకి తీసుకుంది. ఇతను టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ప్రధాన నిందితుడు రాజశేఖర్‌రెడ్డికి స్వయానా బంధువు. ప్రశాంత్‌రెడ్డి విచారణలో వెల్లడించిన సమాచారం మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఫరూక్‌నగర్ మండలం నేరళ్లచెరువుకు చెందిన రాజేందర్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఇతను వారి గ్రామంలో ఇటీవలే విదేశాల నుంచి వచ్చిన ఓ వ్యక్తితో రూ.5 లక్షలు అప్పుగా తీసుకుని.. పేపర్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ప్రశాంత్, రాజేందర్‌ను విచారించిన క్రమంలో గండేడ్ మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తిరుపతయ్య పేరు తెరమీదికి వచ్చింది. డాక్యానాయక్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఆయన లీకేజీ అయిన ఏఈ ప్రశ్నపత్రం విక్రయంలో అభ్యర్థులు, డాక్యానాయక్‌కు మధ్యవర్తిగా వ్యవహరించినట్లు సిట్ నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. మొత్తంగా సిట్ అధికారులు ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాకు చెందిన తొమ్మిది మందిని అరెస్టు చేయడంతో పాటు మరో ఇద్దరు కూడా వారి అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఉమ్మడి పాలమూరులో గండేడ్, నవాబ్‌పేట, మహబూబ్‌నగర్, షాద్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి విచారణ చేశారు. స్థానిక పోలీసులకు సైతం సమాచారం ఇవ్వకుండా రహస్యంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో టీఎస్పీఎస్సీ పేపర్ల లీకేజీ బాగోతం మరికొందరి మెడకు చుట్టుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ఈజీఎస్ ఉద్యోగుల్లో గుబులు

ఉపాధి హామీలో పనిచేస్తున్న డాక్యానాయక్, తిరుపతయ్య మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో వారు ఇంకా ఎంత మందికి పేపర్లు విక్రయించారనే దానిపై సిట్ బృందం క్షుణ్ణంగా జల్లెడ పడుతోంది. సిట్ అధికారులు డీఆర్‌డీఓ అధికారుల వద్ద కూడా వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈజీఎస్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఎంతమంది ఉద్యోగులు టీఎస్పీఎస్సీ పరీక్షలు రాశారనే వివరాలు సేకరిస్తోంది. వారు సెలవు పెట్టి పరీక్షలు రాశారా.. విధులు నిర్వహిస్తూనే రాశారా.. ఎంత మందికి లీకైన ప్రశ్నపత్రాలు చేరాయి.. అనే పలు రకాల కోణాల్లో ఆరా తీస్తుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఉపాధి హామీ టీఏపై సస్పెన్షన్ వేటు?

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో అరెస్టు అయిన గండేడ్ మండల ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతయ్యను సస్పెండ్ చేయనున్నట్లు డీఆర్‌డీఓ యాదయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ రవినాయక్‌కు ఫైల్ పెట్టామని, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అంతకు ముందు తిరుపతయ్య వ్యవహారంపై గండేడ్ ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు డీఆర్‌డీఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్‌లో సిట్ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని, దీంతో రెండు రోజులుగా విధులకు హాజరు కావడం లేదని, సెల్ ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి బాలుడి మృతి


వీరు(ఫైల్)

గోపాల్‌పేట: ఈతకు వెళ్లి బాలుడు మరణించిన ఘటన రేవల్లి మండలంలోని గొల్లపల్లిలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లికి చెందిన స్వామి, కావ్యలకు కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు వీరు(9) గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఈత కోసం తోటి పిల్లలతో పాటు కలిసి బావికి వెళ్లారు. ప్రమాదవశాత్తు వీరు బావిలో పడిపోయాడు. పక్కనున్న పిల్లలు వెంటనే కేకలు వేయగా చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి చేసేసరికి మునిగిపోయాడు. బావిలోకి దిగి వెతికి బయటకు తీయగా, అప్పటికే మృతిచెందాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి సంపులో పడి మహిళ..

రాజాపూర్: ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి మహిళ మృతిచెందిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(70) తన కుమారుడు నూతనంగా నిర్మిస్తున్న ఇంటి ఎదుట నిర్మించిన సంపులో ప్రమాదవశాత్తు పడిపోయింది. కుటుంబ సభ్యులు గమనించి బయటికి తీయగా, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని శ్రీపురంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీపురానికి చెందిన మెరుగు బాలపీరు(45) కుటుంబంలో కొంత కాలంగా కుటుంబ కలహాలు చోటుచేసుకున్నాయి. మనస్తాపానికి గురైన బాలపీరు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి అక్క తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

బిజినేపల్లి: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తిమ్మాజీపేట మండలం మరికల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్(22)ను తల్లి మందలించడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఇంట్లోనే పడుకున్నాడు. వాసన రావడంతో గమనించిన తల్లి చుట్టుపక్కల వారితో కలిసి ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. ఈ సంఘటనపై తల్లి బుడ్డమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్ మైనుద్దీన్ తెలిపారు.

మహిళను వేధించిన వ్యక్తి అరెస్ట్


మల్దకల్: ఓ వివాహిత మహిళను తరచూ వేధింపులకు గురి చేస్తున్న మోష అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను తరచూ వేధిస్తుండటంతో మహిళ తన కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేసింది. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మహిళ ఫిర్యాదు ఆధారంగా వేధింపులకు పాల్పడుతున్న మోషను అరెస్టు చేసి, గద్వాల కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖిల్లాఘనపురం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మల్లగల్ల కుర్మయ్య(50) మద్యానికి బానిసయ్యాడు. కుర్మయ్య ఈనెల 25న మద్యం సేవించి ఇంట్లో పడుకున్నాడు. పశువులను మేపేందుకు వెళ్లాలని భార్య కురమమ్మ కోరగా, నీవే వెళ్లమని చెప్పాడు. చేసేది లేక కర్మమ్మ పశువులను మేతకు తీసుకెళ్లింది. మధ్యాహ్నం సమయంలో మద్యం మత్తులో కుర్మయ్య పశువుల కొట్టం వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య ఇంటికి వచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 27న రాత్రి మృతిచెందాడు. ఈ విషయమై మృతుడి భార్య కుర్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

సిర్సనగండ్లకు బ్రహ్మోత్సవ కళ

- అపరభద్రాద్రిగా పేరుగాంచిన రాములోరి ఆలయం
- ఏకశిలపై వెలసిన సీతారామచంద్రస్వామి
- నేటి నుంచి వారంరోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు
- ప్రభుత్వ లాంఛనాలతో కల్యాణోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం


విద్యుత్ దీపాల వెలుగులో సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయం

చారకొండ: రాష్ట్రంలోనే రెండో అపర భద్రాదిగా.. భక్తులు కోరిన కోరికలు తీర్చే సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి వచ్చేనెల 4 వరకు వారంరోజులపాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ప్రతి ఏటా శ్రీరామ నవమిని పురస్కరించుకొని వేడుకలను కనుల పండువగా నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ఈ పుణ్యక్షేత్రం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల పంచాయతీ పరిధిలోని అయోధ్యనగర్ (గుట్ట)పైన సుమారు 60 ఎకరాల్లో 300 అడుగుల ఎత్తైన ఏకశిలపై వెలసింది. బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి పాలమూరు నుంచే కాక.. రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. శ్రీరామ నవమి రోజున భద్రాచలం మాదిరిగానే ఇక్కడ కూడా ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కల్యాణం జరిపిస్తారు.

అన్ని ఏర్పాటు పూర్తి..

వారంరోజులపాటు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. గురువారం జరిగే కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. ఇందుకు గాను ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేశారు. తాగునీటి ట్యాంకర్లు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.


సీతారామలక్ష్మణుల మూలవిరాట్


భక్తులు వెళ్లే మెట్ల దారి

ప్రత్యేక బస్సులు..

బ్రహ్మోత్సవాలకు మహబూబ్‌నగర్, నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాల నుంచి తరలివచ్చే వేలాది మంది భక్తుల కోసం కల్వకుర్తి, అచ్చంపేట, దేవరకొండ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు బుధవారం మధ్యాహ్నం మాస కల్యాణం, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణోత్సవం ఉంటుంది. శుక్రవారం ఉదయం కుంకుమార్చన, రాత్రి చిన్నరథం (పూలతేరు), శనివారం శివదత్తాత్రేయ పరశురామ, పోచమ్మ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆదివారం అభిషేకం అర్చనాదులు, రాత్రికి పెద్దతేరు (రథోత్సవం), సోమవారం, పల్లకీసేవ, అభిషేకం, నాగబలి, దీపోత్సవం, మంగళవారం ప్రత్యేక పూజలు, పల్లకీసేవ, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ రఘు తెలిపారు.


శ్రీరామ నవమికి మన్యంకొండ ముస్తాబు

- శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు
- 30న కల్యాణం.. 31న పట్టాభిషేకం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 30న పర్వదిన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది శ్రీరామ నవమి రోజు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా దేవస్థానంలో శ్రీరామ నవమి సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆ రోజు స్వామి వారిని దేవస్థానం ముందున్న రామసదనం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి పవిత్ర కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తారు. అనంతరం దేవస్థానంలోని లక్ష్మీ విలాసంలో రెండు రోజుల పాటు జరుగు అఖండ భజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఓబ్లాయిపల్లి, కోటకదిర గ్రామాలకు చెందిన భజన మండలి ఆధ్వర్యంలో ఈ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

31న పట్టాభిషేకం...

స్వామివారికి శ్రీరామనవమి ముగింపు సందర్భంగా ఈనెల 31న పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.అలాగే అదే రోజు స్వామివారికి నివేదన, ఆరగింపు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతారు. అనంతరం వేడుకల ప్రత్యేక ప్రసాదం పానకాన్ని భక్తులకు అందజేయనున్నట్లు దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. స్వామివారి కల్యాణ రుసుము రూ.1,000 ఉంటుందని, భక్తులు సంప్రదాయ పద్ధతిలో దుస్తులు ధరించి కల్యాణంలో పాల్గొనాలని కోరారు.


మన్యకొండ దేవస్థానం

డీటీసీలో అవుట్ డోర్ పరీక్షలు


అవుట్ డోర్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

జడ్చర్ల: పోలీస్ శాఖలో పదోన్నతి పొందడానికి కావాల్సిన అర్హత పరీక్షలలో భాగంగా మంగళవారం జడ్చర్ల పోలీసు శిక్షణ కేంద్రంలో అవుట్‌డోర్, క్రైం సీన్ అబ్జర్వేషన్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. హెడ్ కానిస్టేబుల్, ఏఎస్‌ఐలు ఎస్‌ఐగా పదోన్నతి పొందడానికి కావాల్సిన అర్హత పరీక్షను అధికారులు నిర్వహించారు. చార్మినార్ జోన్‌తో పాటు యాదాద్రి జోన్‌కు సంబంధించిన అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, ఎస్పీ నర్సింహ, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, 12వ బెటాలియన్ సాంబయ్య, ఏఎస్పీ రాములు తదితరులు పర్యవేక్షించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

ఒక వాహనదారుడికి ఐదు రోజుల జైలు శిక్ష


డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు నగదు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు రెండు రోజుల పాటు జిల్లాకేంద్రంలో చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 19మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని మంగళవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి డి.నిర్మల 18 మంది వాహనదారులకు రూ.44 వేలు జరిమానా విధించగా, ఒకరికి రూ.2,000 జరిమానాతో పాటు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అశోక్ మాట్లాడుతూ వాహనదారులు ఎవరూ కూడా మద్యం తాగి వాహనాలు నడపరాదని, ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబాలు ఎంతో నష్టపోతాయని తెలిపారు. మద్యం తాగి నిర్లక్ష్యంగా రోడ్లపైకి వస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అటవీశాఖ సిబ్బందిపై దాడి


అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆటో

మన్ననూర్: వంట చెరుకు తీసుకెళ్తున్న ఆటోను అడ్డుకున్న అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసిన సంఘటన మన్ననూర్‌లో చోటుచేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా మన్ననూర్ ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్ అటవీ ప్రాంతంలోని వెళ్తుండగా, అనుమతి లేకుండా అడవి నుంచి వంట చెరుకు తీసుకువస్తున్న ఆటో కనిపించింది. దీంతో లింగమయ్య చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న బేస్ క్యాంపు సిబ్బందికి సమాచారం ఇచ్చి అలర్ట్ చేశారు. అధికారి ఆదేశాల మేరకు ఆటోను నలుగురు బేస్‌క్యాంపు సిబ్బంది అడ్డుకున్నారు. విచారిస్తుండగా దాసరి మాసయ్య అనే వాచర్‌పై మహేష్ మరికొందరు దాడి చేసి గాయపరిచారు. దీంతో వాచర్‌ను ఆస్పత్రికి తరలించి ఆటోను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఖర్చు చేయకుంటే వెనక్కే



- ఆర్థిక సంవత్సరం ముగింపుతో అధికారుల అప్రమత్తం
- పాఠశాల, ఎమ్మార్సీల ఖాతాల్లో పేరుకుపోయిన నిధులు
- మూడు రోజుల క్రితమే యూనిఫాం నిధులు రూ.86 లక్షలు జమ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల నిర్వహణకు సంవత్సరం పొడవునా ప్రభుత్వం ప్రతి సంవత్సవం నిధులు విడుదల చేస్తుంది. ఇందుకోసం పాఠశాలల విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు వచ్చింది. సకాలంలో అవసరాలకు అనుగుణంగా నిధులు వినియోగించుకోవాల్సి ఉంటుంది. వినియోగించుకోకపోతే డబ్బులు మార్చి నెల అనంతరం వెనక్కి వెళ్లిపోయే అవకాశాలు ఉన్నాయి. దీంతో చివరి రోజులు కావడంతో అవసరమైన నిధులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లాలో 80,280 మంది విద్యార్థులకు గాను ప్రభుత్వం 2 జతల యూనిఫాంలను కుట్టేందుకు టైలర్లకు కాంట్రాక్టు ఇస్తుంది. మొత్తం 1.60 లక్షల యూనిఫాంలను కుట్టగా.. వీటి బిల్లులు ఆర్థిక సంవత్సరం చివరలో మూడు రోజుల ముందు విడుదల చేయడంతో వీటిని డ్రా చేసుకునేందుకు పాఠశాలల హెచ్‌ఎంలు నానా తంటాలు పడుతున్నారు.

రెండు దఫాల్లో కేటాయింపు

జిల్లాలోని 12 మండల వనరుల కేంద్రాలకు ప్రభుత్వం రెండు దఫాల్లో మొత్తం రూ.83 వేలను కేటాయిస్తుంది. వీటిని ఎమ్మార్సీ నిర్వహణకు కరెంట్, టెలిఫోన్ బిల్లులు, ఇంటర్నెట్, టీ, స్టేషనరీ ఇతర ఖర్చుల కోసం వెచ్చించాలి. పాఠశాలల నిర్వహణలో స్టేషనరీ, సబ్బులు, ఫినాయిల్, ఆట వస్తువుల కొనుగోలు వంటి వాటికి ఇస్తుంది. ఇక క్లస్టర్ రీసోర్సు సెంటర్లు 53 ఉండగా వీటిలో ఉపాధ్యాయులు కాంప్లెక్సు సమావేశాలు, స్టేషనరీ, నిర్వహణ, ఇతర ఖర్చుల కోసం నిధులను కేటాయిస్తుంది. అలాగే మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులను అందజేస్తుంది. ఇలా వివిధ రూపాల్లో వచ్చిన బిల్లులను పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్‌ఎంసీ అనుమతితో పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం, వెబ్‌సైట్‌లో పొందుపర్చి అనంతరం డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. నెలాఖరులోగా వినియోగించని నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకునే అవకాశం ఉంది.



సకాలంలో వినియోగించుకోవాలి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు రావడంతో ప్రభుత్వం పాఠశాలలు, ఎమ్మార్సీలకు ఇచ్చిన బిల్లులను అవసరానికి అనుగుణంగా, నిబంధనల ప్రకారం ఎంఈఓలు, హెచ్‌ఎంలు నెలాఖరులోగా వినియోగించుకోవాలి. అలా వినియోగించుకోకుండా ఖాతాల్లో ఉన్న నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. – యాదయ్య, డీఈఓ

వ్యక్తి మృతదేహం పందులపాలు!

- బాదేపల్లిలో ఘటన

జడ్చర్ల: మురుగు నీటి కాలువ పక్కగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కాలువ నీటిలో పడ్డాడు. ఊపిరాడక అక్కడే మృతిచెందాడు. ఆ మృతదేహాన్ని పందులు పీక్కుతుంటుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. స్థానిక లక్ష్మీనగర్ కాలనీకి చెందిన వడ్ల బ్రహ్మాచారి(54) సోమవారం రాత్రి పట్టణంలోకి వెళ్లి వస్తానంటూ ఇంటి నుంచి బయలుదేరాడు. సమీపంలోని ప్రభుత్వ ఎస్టీ హాస్టల్ పక్కన గల మురుగు కాల్వలో ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడు. ఈ సంఘటనపై మంగళవారం మృతుడి భార్య ప్రేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పట్టణంలో పందుల సంచారం తీవ్రంగా ఉందని పట్టణవాసులు తెలిపారు. నియంత్రించే చర్యలు తీసుకోవాలని అధికారులు, పాలకులను కోరుతున్నారు.

ప్రేమించిన వాడితో పెళ్లి చేయలేదని ఆత్మహత్య

- కమాలోద్దిన్‌పూర్‌లో ఘటన
- కేసు నమోదు

ఖిల్లాఘనపురం: ప్రేమించిన అబ్బాయితో పెళ్లి చేయలేదని మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కమాలోద్దిన్‌పూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దానిగారి పెద్దబచ్చన్న, చెన్నమ్మ చిన్నకూతురు దానిగారి శిరీష(23) మహేష్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు కూతురిని పిలిచి ఈ వ్యవహారం వద్దు.. మంచి అబ్బాయిని చూసి పెళ్లి చేస్తామని ఇటీవల చెప్పారు. మంగళవారం కుటుంబ సభ్యులు వివిధ పనుల మీద రోజులాగే వెళ్లిపోయిన తర్వాత, ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు హుటాహుటిన ఇంటికి వచ్చారు. కానీ అప్పటికే శిరీష మృతి చెందింది. ఈ సంఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీహరి తెలిపారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేస్తున్న కొందరు యువకులు
- ఫైనలు ఇవ్వని, అడ్డుకునే వారిపై దాడులు
- మనోళ్లే అంటూ వత్తాసు పలుకుతున్న స్థానిక నేతలు


యువకుల దాడిలో గాయపడిన క్రేన్ డ్రైవర్లు

రాజాపూర్: అసలే వారు చేసేది అక్రమ దందా.. ఆపై ఎవరైనా అడ్డు వస్తే దాడులు చేసే స్థాయికి ఎదిగిపోయారు ఇసుకాసురులు. తప్పు జరిగిందిలే మరోమారు సర్ది చెబుతాం అంటూ వారికి నచ్చజెప్పడంతో.. ఎవరేం చేయలేరు లే అంటూ రాజాపూర్ మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. ముఖ్యంగా రాజాపూర్ శివారులోని దుందుభీ వాగులో ఉన్న ఇసుకను తోడేయడమే కాకుండా.. ఇసుక అయిపోవడంతో మట్టిని తీసి ఫిల్టర్ చేసి పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. మండలంలోని ముదిరెడ్డిపల్లి, నందిగామ, తిర్మలాపూర్, చెన్నవెల్లి, దొండ్లపల్లి తదితర గ్రామాల్లో ఈ దందా కొనసాగుతోంది. గత కొన్ని నెలలుగా ఈ తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. అయితే రాత్రివేళలో రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన కొందరు యువకులు అనుమతి లేని ఇసుక రవాణా చేస్తున్న లారీలను అడ్డుకుని వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారు. మామూళ్లు ఇవ్వని లారీడ్రైవర్లను బెదిరించి మీరు చేసేది దొంగ దందా మాకు ట్రిప్పుకు మామూలు ఇవ్వాల్సిందేనంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు.

రాత్రి దాడులు.. పగలు రాజీలు

రాజాపూర్‌లో తరుచుగా ఇసుక అక్రమంగా లారీలో లోడ్ చేసుకుని వెళ్తున్న సమయంలో కొందరు యువకులు లారీలను ఆపి తమకు మామూలు ఇచ్చి వెళ్లాలని, లేకపోతే దాడులకు సైతం వెనకాడటం లేదు. ఈ క్రమంలో రాత్రివేళలో యువకుల చేతుల్లో దాడికి గురైన వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని మనోళ్లే మరోసారి చేయకుండా చూద్దాం అంటూ రాజీ కుదుర్చుతుండటంతో దెబ్బలు తిన్నవారు సైతం మిన్నకుండిపోతున్నారు.

■ హోంగార్డుగా పనిచేస్తున్న తన కుమారుడు సుదర్శన్‌గౌడ్‌పై కొందరు యువకులు దాడి చేశారని తండ్రి ముదిరెడ్డిపల్లికి చెందిన నారాయణగౌడ్ చెప్పారు. తమకున్న రెండు క్రేన్‌లను సెజ్‌లోని పరిశ్రమల్లో అద్దెకు ఇస్తుంటాడని, అయితే శనివారం రాత్రి రాజాపూర్‌కు చెందిన యువకులు ఇసుక లోడ్‌తో వస్తున్న లారీకి ముదిరెడ్డిపల్లి వద్ద సెజ్‌లోకి వెళ్తున్న క్రేన్ సైడ్ ఇవ్వలేదని డ్రైవర్లపై దాడి చేశారన్నారు. ఈ విషయం తెలిసి తన కొడుకు సుదర్శన్‌గౌడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. రాజాపూర్ చౌరస్తాలో అడ్డుకుని మాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ దాడి చేసి రూ.70 వేల నగదును లాక్కున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి స్పందిస్తూ ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టమని వివరించారు.

క్లుప్తంగా...

భైంసాలో శోభాయాత్రకు ఓకే

షరతులు పాటించాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నిర్మల్ జిల్లా భైంసా పట్టణం, తానూర్‌లో ఈ నెల 30న నిర్వహించే శ్రీ రామ నవమి శోభాయాత్రకు రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు యాత్రకు అనుమతి ఇచ్చింది. మతపరంగా, రాజకీయంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని, రాజకీయ నాయకులు, నేర చరిత్ర ఉన్నవారు యాత్రలో పాల్గొనరాదని స్పష్టం చేసింది. మసీదులు ఉన్న చోట యాత్ర సాగేటప్పుడు 150 మీటర్లకు ముందే సౌండ్ సిస్టం ఆపేయాలని సూచించింది. భైంసాలో శ్రీరామనవమి శోభాయాత్రకు అనుమతి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ హిందూ వాహిని అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తానూర్‌లో శోభాయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన ఎ.నరేందర్, ఆర్.గంగాప్రసాద్ మరో పిటిషన్ వేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సూర్యకరణ్ రెడ్డి, ప్రభుత్వం తరఫున న్యాయవాది సామల రవీందర్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రాణం తీసిన పొగ

చెత్త తగలబెడుతుండగా ఊపిరాడక రైతు మృతి


మృతుడు బాబు (ఫైల్)

బూర్గంపాడు: జామాయిల్ తోటలో పోగైన చెత్తను తగలబెడుతుండగా పొగతో ఊపిరాడక ఒక రైతు మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలివి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన రైతు కలసాని బాబు (65) సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. అప్పటికే నరికిన జామాయిల్ తోటలోని చెత్త తగులబెడుతున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు, పొగ వ్యాపించాయి. దీంతో బాబు పొగ ధాటికి తట్టుకోలేక ఊపిరాడక కుప్పకూలాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో గమనించలేదు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు జామాయిల్ తోటకు వెళ్లగా బాబు మృతదేహం కనిపించింది. ఆయన ఒంటిపై ఎలాంటి కాలిన గాయాలు లేకపోవడంతో.. పొగ, మంటల తీవ్రతకు ఊపిరాడక అస్వస్థతకు గురై మృతి చెందాడని భావిస్తున్నారు. మృతునికి భార్య నాగమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రామోజీ, శైలజకు సీఐడీ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయంలోగానీ విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసుల్లో పేర్కొంది. చిట్‌ఫండ్ చట్టం నిబంధనలను ఉల్లంఘించి నిధులు మళ్లించడంపై ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లపై సీఐడీ అధికారులు ఇప్పటికే కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ అధికారులు విస్తృతంగా నిర్వహించిన తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలో పెట్టుబడులుగా పెట్టడం, ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరిస్తున్నట్లు ఆధారాలతో సహా వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఐపీసీ సెక్షన్లు 420, 409, 120 బి, 477 రెడ్‌విత్ 34, కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం–1982, ఆర్థిక సంస్థల రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో సీఐడీ అధికారులు నలుగురు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లను అరెస్టు చేశారు.

● అదో ఆర్థిక నేర సామ్రాజ్యం...

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును చట్ట విరుద్ధంగా మళ్లించడం ద్వారా రామోజీరావు యథేచ్ఛగా ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. కేంద్ర ప్రభుత్వ చిట్‌ఫండ్స్ చట్టం–1982, రిజర్వ్‌బ్యాంకు చట్టం, ఏపీ ఆర్థిక సంస్థల డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టాలను ఉల్లంఘించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ బ్రాంచి కార్యాలయాల్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో డిసెంబర్‌లో నిర్వహించిన సోదాలతో ఈ అక్రమాల బాగోతం బట్టబయలైంది. సొమ్ములు రాష్ట్రంలోని చందాదారులవి కాగా ఆర్థిక ప్రయోజనాలు మాత్రం పొరుగు రాష్ట్రంలో మకాం వేసిన రామోజీరావువని వెల్లడైంది. రాష్ట్ర చందాదారుల కష్టార్జితానికి రక్షణ లేదని గుర్తించిన స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ దీనిపై సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ నిర్వహించిన సోదాల్లో మరిన్ని అక్రమాలు బయటపడ్డాయి. మరోవైపు స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా ఓ చార్టెడ్ అకౌంటెంట్‌ను ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక నివేదికలను పరిశీలించగా పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఎంతోమంది చందాదారులు తాము మోసపోయినట్లు సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో ఈ అంశంపై దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు సీఐడీ నివేదించింది.

మార్గదర్శిలో గుర్తించిన అక్రమాలు ఇవీ..

అక్రమ డిపాజిట్లు..

రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ డిపాజిట్లను సేకరిస్తోంది. చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 శాతం నుంచి 5 శాతం వరకు చందాదారుడికి వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తున్నట్టే. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడాన్ని చట్టం నిషేధించింది. అయినప్పటికీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరించింది. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రూ.15 వేల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించిన చరిత్ర రామోజీరావుది. అదే తరహాలో ప్రస్తుతం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో అక్రమ డిపాజిట్లు సేకరిస్తున్నారు.

నిధుల మళ్లింపు.. అక్రమ పెట్టుబడులు

చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా రామోజీరావు చందాదారుల సొమ్మును అక్రమ పెట్టుబడులకు మళ్లించారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టింది. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్-చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్-బెంగళూరు, ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్- హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపిస్తూ నిధులను అక్రమంగా మళ్లించారు. ఆ మూడు అనుబంధ కంపెనీల్లో రూ.1,05,80,000 పెట్టుబడి పెట్టినట్టు బ్యాలెన్స్ షీట్‌లో చూపించారు. అయితే ఆ కంపెనీల షేర్ హోల్డర్స్ జాబితా పరిశీలించగా ఒక్క ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాతో రూ.2 కోట్లు పెయిడ్ అప్ క్యాపిటల్‌గా పెట్టుబడి పెట్టినట్లు నిర్ధారణ అయ్యింది. బ్యాలన్స్ షీట్‌లో నోట్ నంబర్ 7 కింద రూ.459.98 కోట్లు చూపించారు. అయితే ఆ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినట్టు పరిశీలనలో వెల్లడైంది. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైసీస్ ఆర్బిట్రేడ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది.

పోంజీ తరహా మోసం..

రామోజీరావు పోంజీ (గొలుసుకట్టు) తరహా మోసాలకు పాల్పడుతున్నారు. మార్గదర్శి సంస్థ చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

చందాదారుల హక్కులకు విఘాతం

రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ బ్రాంచిల్లో చందాదారులు చెల్లించిన మొత్తాలను నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ మేనేజర్లకు (ఫోర్‌మెన్) చట్టప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. రాష్ట్రంలో చందాదారులు చెల్లించిన మొత్తానికి బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు.

ఏప్రిల్ 1 నుంచి దివ్యదర్శనం పునఃప్రారంభం

అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో రోజుకి 15,000 టోకెన్ల జారీ

తిరుమల: కరోనా కారణంగా మూడేళ్ల కిందట రద్దు చేసిన దివ్య దర్శనాన్ని ఏప్రిల్ 1 నుంచి ప్రయోగాత్మకంగా టీటీడీ పునరుద్ధరించనుంది. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో నిత్యం 15,000 టోకెన్లను భక్తులకు జారీ చేయనుంది. 15,000 మంది కంటే ఎక్కువ మంది నడకమార్గంలో తిరుమలకు వస్తే, పరిస్థితిని సమీక్షించి ఏప్రిల్ 15న జరిగే పాలకమండలి సమావేశంలో టోకెన్ల పెంపుపై నిర్ణయం తీసుకోనుంది. కరోనా పరిస్థితుల అనంతరం శ్రీవారి దర్శనంపై ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగించిన నేపథ్యంలో కాలినడకన వచ్చే వారికి దివ్యదర్శనం టోకెన్లను జారీ చేయాలని భక్తుల నుంచి టీటీడీకి విజ్ఞాపనలు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకున్న టీటీడీ తిరిగి దివ్యదర్శనం టోకెన్లను జారీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే నిత్యం 20,000 నుంచి 30,000 సర్వదర్శనం టోకెన్లను భక్తులకు టీటీడీ జారీ చేస్తుండటంతో సర్వదర్శనం టోకెన్ల కోటాను కొంత మేర తగ్గించి నిత్యం అలిపిరి కాలిబాట మార్గంలో 10,000, శ్రీవారి మెట్టు మార్గంలో 5,000 దివ్యదర్శనం టోకెన్లను జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

ప్రజాస్వామ్యం ఖూనీ

- ప్రతిపక్షపాత్ర పోషిస్తున్న బీజేపీ
- పార్లమెంట్‌ను స్తంభింపచేయడం దారుణం
- తెలంగాణ, కేరళలో గవర్నర్లు చట్టాలను తమ కుర్చీలో వేసుకుని కూర్చున్నారు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


భువనగిరిలో అమరవీరుల జ్యోతిని బీవీ రాఘవులుకు అందజేస్తున్న సీపీఎం నాయకులు, చిత్రంలో పార్టీ నాయకులు వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి ఉన్నారు

సాక్షి,యాదాద్రి: పార్లమెంట్‌ను ప్రతిపక్ష పార్టీలు స్తంభింపజేస్తాయి కానీ, అధికారంలో ఉన్న బీజేపీ అదానీ కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తున్నదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. అదానీ స్టాక్ కుంభకోణంపై జేపీసీ వేయాలని ప్రతిపక్షపార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ బీజేపీ పార్లమెంట్‌లో ఆందోళన చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీరు ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయాన్ని రాఘవులు ప్రారంభించారు. ఆ తర్వాత జనచైతన్య యాత్ర బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తోందన్నారు. దేశంలో విపక్షాలు ఏకమై బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుందని లేకుంటే ప్రమాదంలో పడుతుందన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని సీపీఎం ఖండించడంలో ప్రజాస్వామ్యానికి జీవం పోయాలనే ఉద్దేశమే తప్ప కాంగ్రెస్ ప్రత్యేక ప్రేమ ఏమీలేదని స్పష్టం చేశారు. దేశ రక్షణ, ప్రజల హక్కులు, ప్రజాసామ్యం, సమాఖ్య స్ఫూర్తి, సామాజిక న్యాయం కోసం బీజేపీయేతర పార్టీలన్నీ కలిసి రావాలని రాఘవులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి అన్యాయం జరిగితే ప్రతిపక్షాలు ఐక్యం కావాలంటారని, ప్రతిపక్షాలకు అన్యాయం జరిగినప్పుడు మాత్రం కాంగ్రెస్‌కు ఐక్యత గుర్తుకురాదని చురకలంటించారు. తెలంగాణ, కేరళలో గవర్నర్‌లు రాష్ట్ర ప్రభుత్వ చట్టాలను తమ కుర్చీలో వేసుకుని కూర్చున్నారని ఆయన విమర్శించారు.

ముగ్గురిని బలిగొన్న రోడ్డు ప్రమాదం

- జేసీబీని తెస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. భీమ్‌గల్ వద్ద ఘటన
- కారుపై పడ్డ జేసీబీ.. ముగ్గురు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో భార్యాభర్తలు, సోదరి.. మరో నలుగురికి గాయాలు


108 వాహనంలో క్షతగాత్రుల తరలింపు

భీమ్‌గల్: నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణ శివారులో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన వడ్ల రాజేశ్వర్, ఆయన చెల్లెలు గోవింద్ పేట్‌కు చెందిన రమ కుటుంబ సభ్యులు ఏడుగురు భీమ్‌గల్ మండలంలోని బడా భీమ్గల్ ఎల్లమ్మ ఆలయానికి దైవ దర్శనం కోసం వచ్చారు. తిరుగు ప్రయాణంలో కారులో వెళ్తుండగా భీమ్‌గల్ సబ్‌స్టేషన్ వద్ద జేసీబీని ట్రాలీపై తెస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్‌తో పాటు ట్రాలీపై ఉన్న జేసీబీ కారుపై పడింది. కారులో ఉన్న వడ్ల రాజేశ్వర్, ఆయన భార్య జ్యోతి, చెల్లి రమ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు గంట పాటు శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలతో పాటు క్షతగాత్రులను బయటకు తీసేందుకు మూడు జేసీబీలను తెప్పించారు. జేసీబీల సహాయంతో కారులో ఇరుక్కున్న ఇద్దరు చిన్నారులతో పాటు మరో ఇద్దరిని 108లో ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు రమ భర్త రాజేశ్వర్ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు

ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో జిల్లా చిత్రకారుడికి అవకాశం



స్టేషన్ మహబూబ్ నగర్: ప్రముఖ చిత్రకారులు శేష బ్రహ్మం ఏలూరి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఈనెల 31 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న కళాయజ్ఞం ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో జిల్లాకు చెందిన చిత్రకారుడు జేపీ మహేష్ కుమార్‌కు అవకాశం లభించింది. ఈ సందర్భంగా మంగళవారం మహేష్‌కుమార్ మాట్లాడుతూ కళాయజ్ఞం సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ చిత్రకళా పోటీలు నిర్వహించగాను నేను వేసిన చిత్రం ఎంపికై ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడానికి అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు 143 చిత్రాల్లో నేను గీసిన చిత్రం ఒకటిగా ఎంపికైనట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం చలో ఢిల్లీ



మహబూబ్‌నగర్ రూరల్: తెలుగు రాష్ట్రాల అసెంబ్లీలో అనేకమార్లు ఏకగ్రీవ తీర్మానం, ప్రధాన రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూనే ఉన్నాయని ఎమ్మార్పీఎస్ –ఆర్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్ అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈనెల 30, 31వ తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర దీక్ష, ధర్నాలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నమ్మక ద్రోహం చేస్తోందని ఆరోపించారు. ఇచ్చిన మాటను చిత్తశుద్ధితో అమలు చేయాలని, అప్పుడే మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో మాజీ కౌన్సిలర్ ఎన్.బుర్రన్న, నాయకులు మల్లెల రాజశేఖర్, రాజగాని అశోక్, ఎల్.రమేష్, గడ్డమీది గోపాల్, తిరుమలయ్య, పాతూరి రమేష్, బొర్ర సురేష్, శ్రీను, కృష్ణ, దినేష్, పి.నగేష్, చెన్నయ్య, అనిల్‌కుమార్, మెట్టు అంజమ్మ ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మోక్షం


ఎర్రగుట్టలో ప్రారంభానికి ఎదురుచూస్తున్న డబుల్‌బెడ్ రూం ఇళ్లు

- ఏప్రిల్‌లో పంపిణీకి సన్నాహాలు
- జడ్చర్ల నియోజకవర్గంలో 2,604 ఇళ్లు మంజూరు
- ఇప్పటివరకు పూర్తయినవి వెయ్యి ఇళ్లు

జడ్చర్ల: ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లకు మోక్షం లభించనుంది. వచ్చే నెలలో ఇళ్లు కేటాయించే దిశగా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎంతోకాలంగా డబుల్ బెడ్ రూం ఇళ్లకోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కనీస మౌలిక సదుపాయాల కల్పనతో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు జడ్చర్ల నియోజకవర్గంలో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించలేదు. జడ్చర్ల, తదితర గ్రామాలలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను త్వరలోనే పంపిణీ చేస్తామని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రకటించడంతో ఇళ్లు లేని నిరుపేదల్లో ఆశలు రేగాయి. జడ్చర్ల నియోజకవర్గంలో దశలవారీగా మొత్తంగా ఇప్పటివరకు 2,604 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరయ్యాయి. ఎక్కువగా జడ్చర్ల మండలంలోనే దాదాపు 2వేల ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇక ఆయా మండలాల్లో అతి తక్కువ సంఖ్యలో మంజూరయ్యాయి. బాలానగర్, రాజాపూర్ మండలాల్లో కేవలం 104 చొప్పున ఇళ్లు మంజూరయ్యాయి.

నాసిరకంగా పనులు..

డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు నాసిరకంగా సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర ఎంతమాత్రం గిట్టుబాటు కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారన్న విమర్శలు ఉన్నాయి. ఇసుక, స్టీలు, సిమెంట్ తదితర మెటీరియల్ ధరలు పెరగడంతో ఇళ్ల నిర్మాణం భారంగా మారింది. దీంతో నిర్మాణాల్లో నాణ్యత కొరవడింది.

నిర్మాణాలు పూర్తి..

బాదేపల్లి ఎర్రగుట్ట ప్రాంతంలో దాదాపు 360 డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు లబ్ధిదారులకు కేటాయించలేదు. అదేవిధంగా కావేరమ్మపేటలో కూడా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే ఇక్కడ తాగునీరు, విద్యుత్, సీసీరోడ్లు నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చర్లపల్లి, కిష్టంపల్లిలో పనులు పూర్తయ్యాయి. బాలానగర్ మండలంలోని గౌతాపూర్, నవాబ్‌పేట మండలంలోని రుద్రారం, మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి, మసిగుండ్లపల్లి, వాడ్యాల గ్రామాలలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి ఎదురుచూస్తున్నాయి.

దరఖాస్తుల వెల్లువ..

ఇప్పటికే దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క జడ్చర్ల పట్టణంలోనే దాదాపు 3వేలకు పైగా డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చాయంటే పరిస్థితిని ఊహించవచ్చు. అయితే అర్హులను గుర్తించి ఇళ్లు కేటాయించడంలో అధికారులు ఎంతమేరకు పారదర్శకత పాటిస్తారో వేచి చూడాల్సిఉంది.

ప్రారంభానికి సిద్ధం..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేశాము. విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖకు డబ్బులు చెల్లించాము. డ్రైయినేజీ పనులు చివరిదశలో ఉన్నాయి. తాగునీరు, ఇతర పనులు త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించేందుకు ఏర్పాట్లు చేశాము.

– నర్సిములు, ఏఈ, హౌసింగ్, జడ్చర్ల


అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది..



ఇళ్ల కేటాయింపునకు అర్హులయిన వారిని ఎంపిక చేయాల్సిఉంది. ఇప్పటివరకు ఒక్క జడ్చర్ల పట్టణానికి సంబంధించి దాదాపు 3వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని విచారించి అర్హులైన వారిని త్వరలోనే గుర్తించేలా చర్యలు తీసుకుంటాము.

– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల

వచ్చే నెలలో పంపిణీ..



వచ్చే నెలలో డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేస్తాము. అర్హులను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము. అదేవిధంగా ఖాళీస్థలాలు ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.3లక్షలు అందజేసేందుకు చర్యలు చేపట్టాము.

– డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

శిథిలావస్థకు చేరుతున్నాయి..

ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లు సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయని కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయి. వర్షాలకు ఎక్కడికక్కడ నీళ్లు చేరి పగుళ్లు ఏర్పడుతున్నాయి. తలుపులు, కిటికీలు ఊడిపోతున్నాయి. దీంతో లబ్ధిదారుల చేతికి వచ్చే నాటికి మళ్లీ మరమ్మతు చేయించుకోవలసిన పరిస్థితులు ఉన్నాయి.

రొట్టెల యూనిట్ మెరుగుకు కృషి


రొట్టెల తయారీని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: రొట్టెల యూనిట్ మెరుగుకు మరింత కృషి చేస్తామని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి పేర్కొన్నారు. మంగళవారం 'చిరుధాన్యాల రొట్టెలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. దీంతో మిల్లెట్ యూనిట్ వద్దకు వెళ్లి రొట్టెల తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా రొట్టెల యూనిట్ నిర్వాహకులతో మాట్లాడారు. రొట్టెలు ఏ మేర తయారు చేస్తున్నారు.. ఎక్కడెక్కడికి పంపిస్తున్నారు.. ఎలాంటి సదుపాయాలు ఉన్నాయి.. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని యూనిట్ అధ్యక్షురాలు రాఘవేంద్రమ్మను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా రూ.లక్షలు వెచ్చించి యూనిట్‌ను ఏర్పాటు చేశామని దీనిని మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. తరుచుగా మూతపడకుండా రెగ్యులర్‌గా నడిపించుకుంటే ఆదాయం పెరిగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. పనిచేయని మిగతా మిషన్లను సైతం త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తామని చెప్పారు. మంచి ఉత్పత్తులు చేపట్టి చిరుధాన్యాల యూనిట్‌కు జిల్లాస్థాయిలో పేరు తీసుకురావాలని సూచించారు. వారి వెంట ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి, సర్పంచ్ చంద్రకళ తదితరులున్నారు.

బీజేపీని గద్దెదించేందుకు ఐక్య ఉద్యమాలు

- సీపీఎం జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు విజ్జు కృష్ణన్


మాట్లాడుతున్న సీపీఎం జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు విజ్జు కృష్ణన్

వనపర్తి క్రైం: బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు తలపెట్టిన జనచైతన్య యాత్ర మూడో రోజు వనపర్తి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రజా పోరాటాలను కాలదన్నిన శ్రీలంక ప్రధానికి పట్టిన గతే మోదీకి పట్టడం ఖాయమన్నారు. కార్పొరేట్ వ్యవసాయం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన కార్మిక చట్టాలను మోదీ మెడలు వంచి వెనక్కి నెట్టామన్నారు. కరోనా సమయంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్యం అందించి ప్రజల ప్రాణాలు కాపాడిన ఘనత కేరళ రాష్ట్రానిదని కొనియాడారు. అనేక వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మరిపించి, గద్దెక్కిన కేంద్ర ప్రభుత్వం, నేడుహామీలు మరిచి మతతత్వ రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. నిత్యావసర ధరలతో పాటు.. చమురు ధరలు పెంచి సామాన్య ప్రజలపై మోసుభారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మీ ఉద్యోగంలోనూ కాంట్రాక్టు వ్యవస్థ తీసుకురావడం అత్యంత దుర్మార్గమన్నారు. పెట్టుబడి 50 శాతం అదనంగా కలిపి ధర నిర్ణయిస్తే ఆశాజనకమైన గిట్టుబాటు ధర వచ్చేదని, ఆ నివేదికను బుట్టదాఖలు చేసి నల్లచట్టాలు తెచ్చి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. దేశ సంపదను కూడగట్టిన శ్రామికులు, కార్మికుల వద్ద పైసలు లేకుండా పోయాయని, డబ్బంతా ఆదాని, అంబానీల వద్ద కూడుకుందని అన్నారు. కేరళలో 20 లక్షల మందికి పింఛన్లు , 4 లక్షల మందికి పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చామని అన్నారు. యాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ, వెంకటరాములు, వెంకటస్వామి, భూపాల్, అరుణ, జ్యోతి, ధర్మనాయక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విభజనలో ఆర్టిజన్లను పరిగణలోకి తీసుకోవడం దుర్మార్గం


ధర్నా నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ సర్కిల్ నుంచి నారాయణపేట జిల్లా విభజనలో విద్యుత్ ఉద్యోగులైన ఆర్టిజన్లను పరిగణలోకి తీసుకు వారిని విభజించడం దుర్మార్గమని తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు 1104 రీజినల్ అధ్యక్షుడు స్వామి అన్నారు. ఖాళీలను నింపకుండా నారాయణపేట జిల్లాకు ఉద్యోగులను కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం 1104 యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాకు సరిపడే పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నారాయణపేటతో పాటు ఏర్పడిన ములుగు జిల్లా విభజనలో ఆర్టిజన్లను పరిగణలోకి తీసుకోలేదని, కానీ పేట జిల్లాకు ఆర్టిజన్లను ఎందుకు విభజించారని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ మాత్రమే ఎందుకు కిందిస్థాయి ఉద్యోగులను విభజించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ విభజనలో ఎక్కువగా వితంతులు, తల్లిదండ్రులను కోల్పోయిన కిందస్థాయి ఉద్యోగులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో వర్కింగ్ ప్రెసిడెంట్ యాదయ్యగౌడ్, డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటయ్య, సర్కిల్ యూనిట్ ప్రెసిడెంట్ రామరాజు ఉన్నారు.